సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 6 । జూలై । 2023

న్యూస్‌రీల్

అల్లం @ రూ.120



జి.మాడుగుల వారపు సంతలో విక్రయించేందుకు సిద్ధం చేసిన అల్లం

జి.మాడుగుల: అల్లానికి ఆశించిన ధర లభిస్తుండడంతో గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అల్లంకు డిమాండ్ అధికంగా ఉండడంతో జి.మాడుగుల సంతబయలులో మంగళవారం జరిగిన వారపుసంతలో కిలో రూ.120 నుంచి 125 వరకు చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేశారు.ఈ ప్రాంతంలో రిటైల్ మార్కెట్‌లో అల్లం ధర రూ.150 ఉంది. అన్‌సీజన్ కావడంతో ధర పెరిగినట్టు వ్యాపారులు తెలిపారు.

ఆధునిక సేంద్రియ విధానాలతో అధిక దిగుబడులు



విత్తనాలను పంపిణీ చేస్తున్న చింతపల్లి ఏడీఆర్ సురేష్‌కుమార్

సాక్షి, పాడేరు: ఆధునిక సేంద్రియ విధానాలతో అధిక దిగుబడులు సాధించవచ్చని చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక ఏరువాక కేంద్రం ద్వారా బుధవారం విత్తనాలను ప్రదర్శించారు. అనంతరం వరి ఆర్‌జీఎల్ 7016, వేరుశనగలో నిత్యహరిత రకం వంటి నూతన విత్తనాలను ఏడీఆర్ గిరిజన రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక విధానాలపై గిరిజనుల్లో అవగాహన కల్పించాలన్నారు. పాడేరులోని ఏరువాక సేవలను గిరిజన రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చిట్టిబాబు,డాక్టర్ వెంకటరావులు పాల్గొన్నారు.

విహారయాత్రలో విషాదం



నానాజీ మృతదేహం

సీలేరు: విహార యాత్రలో విషాదం చోటు చేసుకుంది. అప్పటి వరకు ఆడుతూ, పాడుతూ సరదాగా గడిపిన తమ సహచరుడు కళ్ల ముందే కుప్పకూలిపోవడంతో స్నేహితులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. వివరాలు...తూర్పుగోదావరి జిల్లా సర్పవరం గ్రామానికి చెందిన 40 మంది ప్రైవేటు బస్సులో బుధవారం సీలేరు అందాలను తిలకించేందుకు వచ్చారు. మొక్కుబడి తీర్చుకునేందుకు ఘాట్‌రోడ్‌లో గల దారాలమ్మ వారి ఆలయం వద్దకు గురువారం వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. ఈ బృందంతో వచ్చిన నానాజీ (45)అనే వ్యక్తి స్థానిక చేపలమార్కెట్‌లో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో స్థానికుల సాయంతో అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నానాజీ గుండెపోటుతో మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో బంధువులు, స్నేహితులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జోరువాన



పాడేరు పట్టణంలో కురుస్తున్న వర్షం

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి పాడేరు హుకుంపేట,జి.మాడుగుల ప్రాంతాలలో వర్షం కురిసింది. పాడేరు పట్టణంతో పాటు సమీప గ్రామాల్లో రాత్రి 8.30 గంటల నుంచి భారీ వర్షం కురిసింది. జోరువానతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది.

దట్టంగా పొగమంచు



వంజంగి కొండలపై మంచు అందాలు


సాక్షి,పాడేరు: జిల్లాలో పొగమంచు దట్టంగా కురుస్తోంది. బుధవారం ఉదయం 8 గంటల వరకు పొగమంచు వీడలేదు. వాహన చోదకులు లైట్లు వేసుకుని ప్రయాణించారు. వంజంగి పర్వతశిఖరాలు మంచు అందాలతో కనువిందు చేశాయి.

మాచ్‌ఖండ్‌కు పూర్వ వైభవం

- రెండేళ్ల తరువాత నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి
- వినియోగంలోకి 4,6 నంబర్ల జనరేటర్లు
- ఆరు జనరేటర్ల ద్వారా రోజుకు 115 మెగావాట్ల విద్యుత్



మాచ్‌ఖండ్ పవర్ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న, ఆరు జనరేటర్లు



మాచ్‌ఖండ్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

సాక్షి, పాడేరు: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ పవర్ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి నిరంతరాయంగా విజయవంతంగా సాగుతోంది. రెండేళ్ల పాటు సాంకేతిక కారణాలతో 4,6 నంబర్ల జనరేటర్లు మూలకు చేరడంతో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. 120 మెగా వాట్లకు గాను కేవలం 60 నుంచి 80 మెగావాట్ల ఉత్పత్తి జరిగేది. ఇరు రాష్ట్రాల జెన్‌కో అధికారులు ఈ రెండు జనరేటర్ల వినియోగంలోకి తెచ్చేందుకు ఎంతో శ్రమించారు. ఎట్టకేలకు మే 19న 6వ నంబరు, 21న 4వ నంబరు జనరేటర్లను వినియోగంలోకి తేవడంతో ప్రస్తుతం ఆరు జనరేటర్ల ద్వారా నిరంతరం విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. గత 40 రోజుల నుంచి రోజుకు 115 మెగా వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. మిగిలిన 5శాతం విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని కూడా చేరుకునేందుకు ఇక్కడ అధికారులు శ్రమిస్తున్నారు.

ఇరు రాష్ట్రాలకు చెరిసగం..

మాచ్‌ఖండ్‌లో జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని 1955లో ఒడిశా,ఆంధ్రా రాష్ట్రాలు సంయుక్తంగా ఏర్పాటు చేశాయి.జోలాపుట్టులోని రెండు రాష్ట్రాలు వేర్వేరుగా రిజర్వాయర్లను నిర్మించాయి. విద్యుత్ ఉత్పత్తి అవసరాలకు వినియోగించే లక్ష్యంతో డుడుమ ప్రాంతంలో ఇరు రాష్ట్రాలు మరో రిజర్వాయర్‌ను నిర్మించాయి.అక్కడ నుంచి ఛానల్ ద్వారా మాచ్‌ఖండ్‌లోని టీపీ డ్యామ్‌కు నీరు మళ్లిస్తున్నారు.మాచ్‌ఖండ్ లోయ ప్రాంతంలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి పైప్‌లైన్ వ్యవస్థతో నీటిని ఫోర్స్‌గా వదులుతుంటారు.ఇక్కడ ఆరు జనరేటర్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది.

ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఇరురాష్ట్రాలు సమానంగా పంచుకుంటాయి.ప్రాజెక్టు నిర్వహణలోను ఇరురాష్ట్రాలు సమానంగా బాధ్యత తీసుకుంటున్నాయి.ఇంత ప్రాధాన్యత గల మాచ్‌ఖండ్ పవర్ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తికి రెండేళ్ల తరువాత పూర్వవైభవం వచ్చిందని ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది తెలిపారు.

విద్యుత్ ఉత్పత్తి వివరాలు

2019–20లో	670.10ఎంయూ
2020–21లో	660.0211ఎంయూ
2021–22లో	718.462ఎంయూ
2022–23లో	543.734ఎంయూ

ప్రస్తుతం నీటినిల్వలు

జోలాపుట్టు రిజర్వాయర్‌లో	2.654టీఎంసీ
డుడుమ రిజర్వాయర్‌లో	0.300టీఎంసీ

వినియోగంలో ఆరు జనరేటర్లు

మాచ్‌ఖండ్ పవర్ ప్రాజెక్టులో ఆరు జనరేటర్లు పనిచేస్తున్నాయి.. 4, 6 నంబర్ల జనరేటర్లు వినియోగంలోకి రావడంతో విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఇబ్బందులు లేవు.ప్రతి రోజు 115 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. సాంకేతిక లోపాలు రాకుండా అన్ని విభాగాల అధికారులు,ఉద్యోగులను అప్రమత్తం చేశాం

– గోవిందరావు, డీఈఈ, మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు

ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



వైద్యశాఖ సమావేశంలో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే

చింతూరు: వైద్యసేవలు అందించే విషయంలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే హెచ్చరించారు. వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగ్యూ ఇతర వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ హెల్త్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా గృహాలను సందర్శించాలని, మలేరియా, డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదైతే నివారణకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్ల పనితీరును నిరంతరం పరిశీలించాలని, మలేరియా, డెంగ్యూ నివారణకు సంబంధించిన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. చింతూరు డివిజన్‌లో నమోదయ్యే పాజిటివ్ కేసుల వివరాలపై ప్రతిరోజూ నివేదిక ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, వైద్యాధికారులు, సబ్‌యూనిట్ ఆఫీసర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అదనపు వార్డు ప్రారంభం : కలెక్టర్ సుమిత్ కుమార్ చొరవతో స్థానిక ఏరియా ఆస్పత్రిలో కొత్తగా నిర్మించిన అదనపు వార్డును పీవో సూరజ్ గనోరే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందేలా వైద్యులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

స్పందనకు 29 దరఖాస్తులు

స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన స్పందనలో వివిధ సమస్యలపై 29 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా పీవో సూరజ్ గనోరే మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సర్దుబాటు కౌన్సెలింగ్

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఆర్‌సీఎం మేనేజ్‌మెంట్ పరిధిలోని ఎయిడెడ్ స్కూళ్లలో బోధన, బోధనేతర సిబ్బందిని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో సర్దుబాటు కోసం బుధవారం డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో పనిచేస్తున్న వారిని సర్దుబాటు చేయగా, సెకండరీ గ్రేడ్ టీచర్లు 23 మంది, బోధనేతర సిబ్బంది 10 మంది, క్రాఫ్ట్ టీచర్ ఒకరు, డ్రాయింగ్ టీచర్ ఇద్దరికి కౌన్సెలింగ్ ద్వారా ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని స్కూళ్లలో సర్దుబాటు చేశారు. ఆర్‌సీఎం మేనేజ్‌మెంట్ తమ పరిధిలోని పాఠశాలలకు ప్రభుత్వ ఎయిడ్‌ను వదుకుంటున్నట్లు ఇప్పటికే సమ్మతి పత్రాన్ని అందజేసింది. ఈ నేపథ్యంలో ఇక్కడి విద్యార్థులను సమీపంలో గల వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ప్రభుత్వం ద్వారా వేతనాలు పొందుతున్న బోధన, బోధనేతర సిబ్బంది మొత్తం 52 మందిని ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని పాఠశాలల్లోకి తీసుకున్నారు. కాగా వీరిలో కొంతమంది ఉపాధ్యాయులపై సర్వీసు పరమైన ఆరోపణలు, విజిలెన్స్ విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. వీరి విషయంలో తదుపరి చర్యలు ఎలా ఉంటాయనేది ఉపాధ్యాయుల్లో చర్చసాగుతుంది.

3,991 ధ్రువీకరణ పత్రాల పంపిణీ



కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలోని 12 మండలాల పరిధిలోని 20 సచివాలయాల్లో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష పథకం ప్రత్యేక శిబిరాలు విజయవంతమైనట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శిబిరాల పరిధిలో 18,633 గృహాల నుంచి వలంటీర్లు యాప్‌ల ద్వారా వివిధ ధ్రువీకరణపత్రాల నిమిత్తం 14,855 వినతులు స్వీకరించారని ఆయన తెలిపారు.13,973 టోకెన్లు నమోదు చేసి, 9,683 వినతులను ఆన్‌లైన్ చేశారన్నారు. 23 దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా, 3,991 ధ్రువీకరణపత్రాలను పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. మిగిలిన 5,671 పత్రాలను రెండు రోజుల్లోగా పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు.

నేడు 17 సచివాలయాల్లో జగనన్న సురక్ష

జిల్లాలోని 10 మండలాల పరిధిలో 17 సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష పథకం ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. అడ్డతీగల మండలంలోని వీరవరం, అనంతగిరి మండలంలోని బొర్ర,గుమ్మకోట, అరకులోయ మండలంలోని పెదలబుడు–2, సిరగం,చింతూరు మండలంలోని కుమ్మురు,చింతూరు–2, జీకే వీధి మండలంలోని దేవరాపల్లి,లక్కవరపుపేట,హుకుంపేట మండలంలోని గూడ,గడికించుమండ,కూనవరం మండలంలోని పెదరూకురు,ముంచంగిపుట్టు మండలంలోని పెదగూడ,బూసిపుట్టు, ఎటపాక మండలంలోని గంగవరం, పిచ్చుకులపాడు, వై.రామవరం మండలంలోని వై.రామవరం సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

46 మందికి గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా పదోన్నతి



పదోన్నతి పొందిన వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందజేస్తున్న ఆర్జేడీ జ్యోతికుమారి

మధురవాడ(విశాఖ): ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో 46 మంది స్కూల్ అసిస్టెంట్లకు ప్రభుత్వ నిర్వహణలోని పాఠశాలల్లో గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించినట్టు ఆర్జేడీ ఎం.జ్యోతికుమారి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆదేశాలు జారీ చేసి.. వెంటనే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. మధురవాడలోని జోన్–1 పాఠశాల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించే ప్రక్రియ మంగళవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఉమ్మడి విశాఖలో 25, విజయనగరంలో 7, శ్రీకాకుళంలో 14 కలిసి మొత్తం 46 పోస్టులు ఖాళీ ఉన్నట్లు అధికారులు నిర్ధారించి కౌన్సెలింగ్ చేపట్టారు. మొత్తం 72 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఇందులో ముగ్గురు ప్రమోషన్ వద్దన్నారు. దీంతో వారి తర్వాత స్థానంలో ఉన్న వారికి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన వారిని వెంటనే ప్రస్తుత స్థానాల నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రిలీవ్ చేయాలని ఆదేశించారు. పదోన్నతి పొందిన వారంతా తమకు కేటాయించిన పాఠశాలల్లో గ్రేడ్–2 హెచ్‌ఎంగా విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జెడ్పీ యాజమాన్య పాఠశాలల్లో 22 మందికి..

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలో జెడ్పీ యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 22 మందికి గ్రేడ్–2 హెచ్‌ఎంగా పదోన్నతి కల్పిస్తూ విద్యాశాఖ ఆర్జేడీ ఎం.జ్యోతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల హెచ్‌ఎంలను ఎంఈవోగా పదోన్నతులు కల్పించిన నేపథ్యంలో ఏర్పడిన ఖాళీల భర్తీ కోసం అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు ఈ నెల 4న కౌన్సెలింగ్ నిర్వహించారు. అందుబాటులో ఉన్న ఖాళీల మేరకు, అర్హత గల ఆసక్తి చూపిన స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించినట్లు ఆర్జేడీ తెలిపారు. పదోన్నతి పొందిన వారిని వెంటనే ప్రస్తుత ప్రదేశాల నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రిలీవ్ చేయాలని ఆదేశించారు. పదోన్నతి పొందిన వారంతా తమకు కేటాయించిన పాఠశాలల్లో గ్రేడ్–2 హెచ్‌ఎంగా విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు 10 వేల రేబిస్ టీకాలు

- పెంపుడు కుక్కలకు ఉచితంగా వ్యాక్సినేషన్
- ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు



కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యుడు(ఫైల్)

సాక్షి, పాడేరు : సంక్రమిత వ్యాధుల దినోత్సవం (జునోసిస్ డే) కోసం పశుసంవర్ధక శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. జిల్లాలో పెంపుడు కుక్కలకు గురువారం ఉచితంగా 10 వేల టీకాలు వేసేందుకు చర్యలు చేపట్టారు. ఒకప్పుడు పాడేరు,అరకులోయ,చింతపల్లి,చింతూరు,రంపచోడవరం వంటి ముఖ్యమైన పశువుల ఏరియా ఆస్పత్రుల్లోనే జునోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేసేవారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో గత ఏడాది నుంచి జిల్లాలోని 22 మండలాల పశువుల ఆస్పత్రుల్లో కుక్కలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 10వేల వరకు పెంపుడు కుక్కలు ఉన్నట్టు గుర్తించి,10 వేల టీకాలను సిద్ధం చేసినట్టు ఏడీ డాక్టర్ రవికుమార్ 'సాక్షి'కి తెలిపారు. జిల్లా కేంద్రం పాడేరులోని పశువైద్యకేంద్రంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ జునోసిస్ డే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. పెంపుడు కుక్కల యజమానులు తమ కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్‌ను వేయించాలని, నిర్లక్ష్యం చేయవద్దని ఏడీ రవికుమార్ కోరారు.

జాగ్రత్తలు అవసరం

కుక్కల నుంచి ప్రాణాలను హరించే అంటు రోగాలు వ్యాప్తి చెందుతున్నాయని, పెంపుడు కుక్కలపై ప్రేమను పెంచుకోవడం మంచిదే అయినప్పటికీ అందుకు తగ్గట్టుగానే జాగ్రత్తలు కూడా తీసుకుని వ్యాక్సినేషన్ చేయించాలని ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు. వైరస్ ద్వారా రేబిస్, మెదడు వాపు, గాలికుంటు వంటి వ్యాధులు కుక్కలకు సోకుతాయి. కుక్కలకు టీకాలు వేయని పక్షంలో అవి కరవడం ద్వారా ప్రజలకు కూడా రేబిస్ వ్యాధి సోకి మరణాలు కూడా సంభవిస్తున్న పరిస్థితులు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కుక్కల పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారులు కోరుతున్నారు.

సురక్షతో గిరిజనులకు మేలు

జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్



భీంపోల్‌లో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జేసీ శివశ్రీనివాస్, ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: జగనన్న సురక్ష కార్యక్రమంతో గిరిజనులకు మేలు జరుగుతుందని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ అన్నారు. తహసీల్దార్ రాంబాయి ఆధ్వర్యంలో మండలంలోని భీంపోల్ పంచాయతీలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జేసీ శివశ్రీనివాస్ మాట్లాడుతూ అర్హతగల ప్రతి కుటుంబానికి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తామని, జగనన్న సురక్ష కార్యక్రమంతో గిరిజనులకు మేలు జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు ప్రతికుటుంబానికి అందేవిధంగా సచివాలయం సిబ్బంది కృషి చేయాలి సూచించారు. నాన్ షెడ్యూల్ పంచాయతీల్లో గిరిజనుల భూములు అన్యాక్రాంతవుతున్నాయని, దీనిపై చర్యలు చేపట్టాలని జాయింట్ శివశ్రీనివాస్‌కు కలెక్టర్‌కు ఎంపీపీ శెట్టి నీలవేణి కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ భీమ్మలమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శి గంగాధరస్వామి, కో ఆప్షన్ సభ్యుడు మదీనా, వైస్‌సర్పంచ్ అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

ఇది పేదల ప్రభుత్వం



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



కిముడుపల్లిలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- నాటి, నేటి పాలనల మధ్య వ్యత్యాసాన్ని గమనించండి
- ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: ఒకప్పుడు ధ్రువీకరణ పత్రాలు కావాలంటే రోజులు, వారాల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది, అయినా సర్టిఫికెట్లు అందుతాయన్న నమ్మకం ఉండేదికాదు.. ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నం. వెంటనే అధికారులు అందజేస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. నాటి, నేటి పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని ఆమె కోరారు. రేవళ్ల,కొయ్యూరులలో బుధవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరు మంచి చేశారో గ్రహించాలని కోరారు. తమ ప్రభుత్వం పూర్తిగా పేదల కోసం పనిచేస్తోందని చెప్పారు. టీడీపీ హయాంలో 32 లక్షల మందికి పింఛన్లు ఇస్తే, ఇప్పుడు 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామన్నారు. వలంటీర్లు,సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారుల కృషితో 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా ఇవ్వగలుగుతున్నామని చెప్పారు. దీన్ని చూసి సహించలేక పోతున్న టీడీపీ నాయకులు.. అనర్హులకు సర్టిఫికెట్లు ఇస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు తదితరులు మాట్లాడుతూ టీడీపీ నాయకులను నమ్మవద్దని చెప్పారు. ఎంపీడీవో లాలం సీతయ్య,తహసీల్దారు తిరుమలరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, సీనియర్ నేత గాడి సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలు,మండల కన్వీనర్ బండి సుధాకర్, ఎంపీటీసీ మల్లికార్జున్, సర్పంచ్‌లు వెంకటలక్ష్మి,నత్తూరు సోమన్నదొర,మాకాడ బాలరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని సన్మానించారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన
–అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారదర్శకపాలన అందిస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని మారుమూల కిముడుపల్లిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. జగనన్న సురక్షతో అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని తెలిపారు. పారదర్శక, సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలన్నారు.ఈ కార్యక్రమంలో 229 ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. గంపరాయి గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సువర్ణ ఫణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 186 ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో పూర్ణయ్య, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, స్థానిక సర్పంచ్ శోభరాణి, వైస్ ఎంపీపీ రాజుబాబు, మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, మాజీ వైఎస్ ఎంపీపీ వంతాల శాంతి,సీకరి,పెదకోడాపల్లి ఎంపీటీసీలు వంతాల ఆనందరావు,అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు గంపరాయి సూరయ్య, వంతాల అప్పారావు,కొర్రా రామారావు, పాంగి యేసుబాబు, టింబ్రునాయుడు పాల్గొన్నారు.

కొండరెడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న సుశీల్‌బడింగ్

రంపచోడవరం: రాష్ట్రంలో కొండరెడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్టు కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో గల గిరిజన మంత్రిత్వ శాఖ ప్రతినిధి సుశీల్‌బడింగ్ తెలిపారు. మండలంలోని వేములకొండ పంచాయతీ పరిధిలోని చెలకవీధిలో గిరిజన సంక్షేమ శాఖ ట్రైకార్ జనరల్ మేనేజర్ మణికుమార్‌తో కలిసి బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి గిరిజనులతో మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాల గురించి ఆరా తీశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలో 75 తెగలను పీవీటీజీలుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. పీవీటీజీల గ్రామాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో రాష్ట్రపతి ఆదేశాల మేరకు ఈ పర్యటన చేపట్టినట్టు ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ సీహెచ్ శ్రీనివాస్‌రావు,సర్పంచ్ పండుదొర,ఎంపీటీసీ సభ్యుడు నర్రి పాపారావు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుష్టు నివారణకు చర్యలు



సిబ్బందికి సూచనలిస్తున్న విశ్వేశ్వరనాయుడు

కొయ్యూరు/గూడెంకొత్తవీధి: జిల్లాలో కుష్టు నివారణకు వీలుగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కుష్టు నివారణ అధికారి, క్షయ నియంత్రణ అధికారి, పాడేరు అదనపు వైద్య ఆరోగ్య అధికారి ఎం.విశ్వేశ్వరనాయుడు తెలిపారు. ఆయన బుధవారం గూడెంకొత్తవీధి, కొయ్యూరు ఎంపీడీవో కార్యాలయంలో వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కుష్టును నిర్ధారించేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. శరీరంలో స్పర్శ లేని మచ్చలు ఉంటే ప్రాథమికంగా గుర్తించాలన్నారు. సర్వే విధానంపై అవగాహన కల్పించారు. టీఎస్‌పీ నాయుడు పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు



పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న ప్రాజెక్టు ఎస్‌ఈ గోవిందరాజులు

ముంచంగిపుట్టు: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో పదవీ విరమణ పొందిన ముగ్గురు ప్రాజెక్టు ఉద్యోగులకు బుధవారం రాత్రి మాచ్‌ఖండ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సన్మాన సభ నిర్వహించారు. ప్రాజెక్టు ఎస్‌ఈ గోవిందరాజులు, ఏడీలు సత్య కిరణ్, భజసుందర్ పాడిలు పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఎంఎంఎస్ కామేశ్వరరావు, వై.వాసుదేవ్, పి.సోములకు దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ప్రాజెక్టు ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు విశాఖ సంగీత కళాకారుల సమావేశం

దాబాగార్డెన్స్: విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు తిరుమలరావు, శ్రీనివాసరావు తెలిపారు. గాయనీ గాయకులు, కళా సంస్థల అధినేతల సభ్యత్వ నమోదు, అడ హాక్ కమిటీ నియామకం, ఎన్నిక తేదీ ఖరారు తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు.

ఆర్బీకేల ద్వారా పశుగ్రాస విత్తనాలు

- రైతుకు 75 శాతం సబ్సిడీపై సరఫరా
- అందుబాటులో జొన్న, మొక్కజొన్న, సజ్జ, అలసంద విత్తనాలు
- భూమి పాస్ పుస్తకం నకలు సమర్పించి తీసుకునే అవకాశం
- సర్టిఫై చేసిన నాణ్యమైన సీఎస్‌హెచ్–24 విత్తనాలతో అధిక దిగుబడి



సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) ద్వారా సర్టిఫై చేసిన నాణ్యమైన పశుగ్రాస విత్తనాలను రైతులకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. రైతుకు 75 శాతం సబ్సిడీపై స్థానికంగా డిమాండ్ ఎక్కువగా ఉన్న సీఎస్‌హెచ్–24 జొన్న రకం పశుగ్రాసం విత్తనాలను, మొక్కజొన్న, సజ్జ, అలసంద విత్తనాలను అందిస్తోంది. ప్రస్తుతం రైతులకు 48 టన్నుల వరకు జొన్న, మొక్కజొన్న, సజ్జ, అలసంద విత్తనాలను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచారు. 20 సెంట్ల నుంచి ఎకరం పొలం కలిగిన సన్న, చిన్నకారు రైతులకు 5 నుంచి 20 కిలోల వరకు సరఫరా చేయనున్నారు. రైతులు ఆర్బీకేల్లో భూమి పాస్ పుస్తకం నకలు సమర్పించి విత్తనాలను సబ్సిడీపై తీసుకునే అవకాశం వ్యవసాయ శాఖ కల్పించింది.

జొన్న విత్తనాలు

జిల్లాలో 21.55 టన్నుల సీఎస్‌హెచ్–24 రకం జొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఈ విత్తనాలతో ఎకరానికి 35–40 టన్నుల వరకు (3 కోతలలో) దిగుబడి వస్తుంది. ఎకరానికి కావలసిన 15 కేజీల విత్తనాల మార్కెట్ ధర 460 వరకు ఉంటే.. ప్రభుత్వ సబ్సిడీ 75 శాతం (రూ.345)పోను రైతులు చెల్లించవలిసింది రూ.115లు మాత్రమే. ఈ పశుగ్రాసంలో మాంసకృత్తులు 7 నుంచి 8 శాతం వరకు ఉంటాయి. ఈ రకం జొన్న కీటకాలు, తెగుళ్లు రాకుండా తట్టుకోగలదు.

మొక్కజొన్న విత్తనాలు

జిల్లాలో 11.25 టన్నుల ఆఫ్రికన్ టాల్ రకం మొక్కజొన్న విత్తనాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎకరాకు 12–15 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. 5 కిలోల విత్తనాల మార్కెట్ ధర రూ.340 ఉంటే.. ప్రభుత్వ సబ్సిడీ 75 శాతం (రూ.255) పోనూ రూ.85 చెల్లిస్తే చాలు. ఈ పశుగ్రాసంలో 11 నుంచి 13 శాతం వరకు మాంసకృత్తులు ఉంటాయని వైద్యులు వెల్లడిస్తున్నారు.

అలసంద విత్తనాలు

జిల్లాలో 8.36 టన్నుల ఈసీ 4215 రకం అలసంద విత్తనాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇవి ఎకరానికి 10–12 టన్నుల వరకు దిగుబడి ఇస్తాయి. ఎకరానికి 9–10 కేజీల విత్తనాలు వరకు అవసరం ఉంటుంది. 3 కిలోల విత్తనాల మార్కెట్ ధర రూ.295 ఉండగా.. ప్రభుత్వ సబ్సిడీ 75 శాతం 222) మినహాయించి రైతులు రూ.73 చెల్లిస్తే సరిపోతుంది. ఈ పశుగ్రాసంలో మాంసకృత్తులు 18 నుంచి 21 శాతం వరకు ఉంటాయి. వీటితోపాటు జీర్ణమయ్యే పదార్థాల శాతం 49 నుంచి 51 వరకు ఉంటుంది.

సజ్జ విత్తనాలు

జిల్లాలో 2 టన్నుల బీఏఐఎఫ్–1 రకం సజ్జ విత్తనాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎకరానికి 10–12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఇవి ఒక ఎకరానికి 3–4 కేజీల వరకు సరిపోతాయి. కిలో విత్తనాల మార్కెట్ ధర రూ.98గా ఉంటే .. ప్రభుత్వ సబ్సిడీ పోను రూ. 24.5లకే ప్రభుత్వం అందిస్తోంది.

ఆర్బీకేల్లో సంప్రదించండి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్బీకేల ద్వారా సర్టిఫై చేసిన నాణ్యమైన పశుగ్రాసం విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నాం. అర్హత, ఆసక్తి కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సమీప ఆర్బీకేల్లోని పశుసంవర్ధక సహాయకులను సంప్రదించండి. నాణ్యమైన సీఎస్‌హెచ్–24 విత్తనాన్ని తీసుకొని అదును దాటిపోకుండా నాటుకోవాలి.

– డాక్టర్ ప్రసాదరావు, పశుసంవర్ధక శాఖ జేడీ

సక్రమంగా మెనూ అమలు

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్

ముంచంగిపుట్టు: ఆశ్రమ పాఠశాలల్లో మెనూ కచ్చితంగా అమలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–2ను ఐటీడీఏ పీవో బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు, విద్యా బోధన, విద్యార్థుల హాజరు,పాఠశాలలో సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు.బూట్లు ఇవ్వలేదని తెలుసుకుని హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.స్టాక్ రూమ్‌ను పరిశీలించి, కాలం చెల్లిన పెరుగు ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత పాటించాలని హెచ్‌ఎం,వార్డెన్‌లు సూచించారు. విద్యార్థుల అందరికీ జగనన్న విద్యా కనుక కిట్లు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ బోధనతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఆశ్రమ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలు పక్కాగా అమలు చేయాలని తెలిపారు.అనంతరం లబ్బూరు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. నిత్యం వైద్యాధికారులు,వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని సూచించారు.

రంగబయలు రోడ్డు పరిశీలన

మండలంలోని అత్యంత మారుమూల గ్రామం రంగబయలుకు నిర్మించిన తారు రోడ్డును పీవో పరిశీలించారు. ఇటీవల కోతకు గురైన జోడిగుమ్మ తారు రోడ్డును పరిశీలించి, కోతకు గురి కావడానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఘాట్ మార్గంలో రహదారి నిర్మాణ డైవర్షన్‌ను మార్చాలని, జోడిగుమ్మ, కోసంపుట్టు, పట్నపడాల్ పుట్టు గ్రామాల గిరిజనుల రాకపోకలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు.అటవీ శాఖ అనుమతుల కోసం ఏమైనా అడ్డంకులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పీఆర్ డీఈఈ రవికుమార్,ఏఈఈ సంతోష్‌లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–1 కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ భాగ్యవతి,సర్పంచ్ ధనియా హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదంపై విచారణ

- సాహితీ ఫార్మా కంపెనీని సందర్శించిన జేసీ కమిటీ



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

రాంబిల్లి: సాహితి ఫార్మా కంపెనీని బుధవారం జాయింట్ కలెక్టర్ జాహ్నవి నేతృత్వంలో విచారణ కమిటీ సందర్శించింది. గత నెల 30న రియాక్టర్లు పేలి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు నలుగురు కార్మికులు సత్తిబాబు, తిరుపతి, రామేశ్వర్, అప్పారావు మృతి చెందారు. ఈ ప్రమాదంపై ప్రభుత్వం జేసీ జాహ్నవి నేతృత్వంలో విచారణ కమిటీని నియమించింది. ఈ కమిటీ బుధవారం సాహితి ఫార్మా కంపెనీని సందర్శించి విచారణ నిర్వహించింది. మీడియాను అనుమతించలేదు. కమిటీ సభ్యులు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. సాల్వెంట్‌ల మిశ్రమంలో ఏయే రసాయనాలుంటాయి, ఎలా శుద్ధి చేస్తారు తదితర అంశాలపై ఆరా తీశారు. సాల్వెంట్ లోడింగ్ ఎలా చేస్తారు.. సాల్వెంట్ లోడింగ్ చేసే సమయంలో ఏమైనా పొరబాట్లు జరిగాయా అన్న కోణంలో విచారణ చేపట్టినట్లు తెలిసింది.

పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు



మాట్లాడుతున్న ఎల్‌బి కిరణ్‌కుమార్, పార్టీ నాయకులు

అరకులోయ రూరల్: పార్టీ బలోపేతానికి వైఎస్సార్‌సీపీ యువజన విభాగంలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నట్టు పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు ఎల్.బి.కిరణ్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల విభాగం రాష్ట్ర ఇన్‌చార్జి, ఎంపీ విజయ్‌సాయిరెడ్డి, యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్దార్థరెడ్డిల ఆదేశాల మేరకు అల్లూరి జిల్లా కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అరకులోయ, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో సమన్వాయం చేస్తు వారి వారి సహకారంతో అని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న వారికి అధిష్టానం సముచిత స్థానం ఇస్తుందని, ఈ మేరకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్టు చెప్పారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అందరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు లక్ష్మణకుమార్, సర్పంచ్ నాగేశ్వరరావు, సుబ్బారావు, నాయకులు నర్సింగ్, రమేష్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

సాక్షి, అనకాపల్లి : రెండేళ్ల క్రితం నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామంలో జరిగిన చోరీ కేసులో నిందితుడు బసవరాజు శ్రీనివాస్‌కు మూడేళ్ల కారాగార శిక్షను విధిస్తూ బుధవారం యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టు తీర్పునిచ్చింది. 2020, అక్టోబర్ 27న నక్కపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఉద్దండపురం గ్రామానికి చెందిన కొంతం నూకరత్నం ఇంట్లో మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, ఐదు తులాల వెండి పట్టీలు దొంగిలించిన కేసులో నిందితుడికి శిక్ష పడింది. వివరాలివి. అక్టోబర్ 27న మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో నూకరత్నం బయటకు వెళ్లిన సమయంలో ఆ ఇంట్లోకి చొరబడిన శ్రీనివాస్ బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించాడు. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నల్గొండ జిల్లా రాంనగర్‌కు చెందిన శ్రీనివాస్‌పై పలు చోరీ కేసులున్నాయి. 2021 మార్చిలో గుంటూరు జిల్లా పత్తిపాడులో చోరీ చేసిన నగలను అమ్మే క్రమంలో అతను పోలీసులకు పట్టుబడ్డాడు. విచారణలో నిందితుడి వద్ద లభించిన వెండి పట్టీలు నక్కపల్లి మండలం ఉద్దండపురంలో చోరీ చేసినవని గుర్తించారు. అనకాపల్లి పోలీసులు దర్యాప్తు ప్రారంభించి కోర్టులో అభియోగపత్రం పొందుపరిచారు. అడిషనల్ పీపీ జ్యోతిసుధ వాదనలు వినిపించారు. నేరం రుజువై నిందితుడికి మూడేళ్ల కారాగార శిక్షను విధిస్తూ తీర్పు ఇచ్చారు. పీపీ జ్యోతి సుధ, కేసు దర్యాప్తు చేసిన ఎస్‌ఐ శిరీషను జిల్లా ఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.

‘16 రోజుల్లో సినిమా చిత్రీకరణ పూర్తి చేస్తాం’



మాట్లాడుతున్న నిర్మాత బ్రహ్మాజీ

దాబాగార్డెన్స్: జెస్విన్ సినిమాస్ బ్యానర్‌పై నిర్మించబోయే రెండో చిత్రాన్ని నిర్మాత ప్రకటించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం కొత్త చిత్రం వివరాలను వెల్లడించారు. నిర్మాత బెన్నబత్తుల బ్రహ్మాజీ మాట్లాడుతూ జెస్విన్ సినిమాస్ పతాకంపై గతంలో తస్మాత్ జాగ్రత్త సినిమా తీశానని గుర్తు చేశారు. రెండో సినిమా కేవలం 16 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేసి.. డిసెంబర్‌లో విడుదల చేస్తామని వెల్లడించారు. దర్శకుడు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ విశాఖ, అరకు లొకేషన్లలో సినిమా చిత్రీకరణ పూర్తి చేస్తామన్నారు. హీరో రతన్‌కాంత్ మాట్లాడుతూ తస్మాత్ జాగ్రత్త సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యాయని, రెండో సినిమాలో కూడా మంచి పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. ఈ సినిమాలో తనది మంచి పాత్ర అని హీరోయిన్ సుష్మా జెస్విన్ తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్లు దుర్గాప్రసాద్, నాగమణి, కెమెరామన్ సంతోష్, నటులు త్రినాథ్, నీహారిక, పాటల రచయిత శివాజీ, ఈవెంట్స్ అధినేత దామోదర్ పాల్గొన్నారు.

ప్రియుడిపై ప్రియురాలు ఫిర్యాదు

బీచ్‌రోడ్డు: ప్రేమిస్తున్నానని చెప్పి మోసం చేసిన ప్రియుడిపై అతని ప్రియురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ.. జగదీష్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో ఓ యువతిని మభ్యపెడుతూ.. ఆమె నుంచి నగదు వసూలు చేశాడు. తనను పెళ్లి చేసుకోవాలని మంగళవారం యువతి అతన్ని నిలదీయడంతో గొడవ జరిగింది. జగదీష్ ఆమెను దుర్భాషలాడుతూ దాడి చేసి గాయపరిచాడు. ఆమె దిశ ఎస్‌వోఎస్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు వివరాలు సేకరించి.. జగదీష్‌పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

కుటుంబ సభ్యుల చెంతకు మహిళ



కుమారిని ఆమె తండ్రికి అప్పగిస్తున్న సీఐ ఈదుల నరసింహారావు

గోపాలపట్నం: పాత గోపాలపట్నం ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించిన మహిళను కుటుంబ సభ్యుల చెంతకు గోపాలపట్నం పోలీసులు చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాత గోపాలపట్నం ప్రాంతంలో మహిళ అనుమానాస్పదంగా కనపడడంతో పోలీసులకు స్థానిక సచివాలయ మహిళా పోలీస్ సమాచారమిచ్చింది. దీంతో ఎస్‌ఐ రామకృష్ణ ఆ మహిళ వివరాలు సేకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం గుంతగన్నెల గ్రామానికి చెందిన బాకు కుమారిగా గుర్తించారు. భర్తతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వచ్చిందని సీఐ ఈదుల నరసింహారావు తెలిపారు. డుంబ్రిగుడ పోలీసులకు సమాచారమివ్వడంతో మహిళ తండ్రి గోపాలపట్నం స్టేషన్ వచ్చారు. దీంతో ఆమెను తండ్రికి అప్పగించారు.

దాడి కేసులో నిందితుడికి రూ.10 వేలు జరిమానా

అక్కిరెడ్డిపాలెం(గాజువాక): ఆస్తి, ఇంటి స్థలం విషయంలో తల్లి, తమ్ముడిపై దాడి చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జరిమానా విధించినట్టు గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. 2017 సెప్టెంబర్ 4న గుడివాడ సంజయ్ కుమార్ అనే వ్యక్తి మింది గ్రామంలోని ఆస్తి, ఇంటి స్థలం విషయంలో వివాదం నెలకొనడంతో తన తల్లి గుడివాడ పద్మావతి, తమ్ముడు మురార్జీ కుమార్‌లపై దాడి చేసి గాయపర్చాడు. దీంతో బాధితులు గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అప్పటి ఎస్‌ఐ మన్మథరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి గాజువాక 3వ ఏసీఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ ఈ.రాజేంద్రబాబు రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని సీఐ తెలిపారు.

లబ్బూరు వద్ద 30 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు



పట్టుబడ్డ గంజాయి, నిందితులతో ముంచంగిపుట్టు పోలీసులు

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు జంక్షన్ వద్ద అక్రమంగా ఒడిశాకు తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయితో పాటు రవాణాకు ఉపయోగించిన బైకు, బొలెరో వాహనం, రెండు సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ కె.రవీంద్ర కథనం ప్రకారం వివరాలివి. గంజాయి రవాణాపై పక్కా సమాచారం రావడంతో లబ్బూరు జంక్షన్ వద్ద బుధవారం ఉదయం బరడ నుంచి లబ్బూరు జంక్షన్ వైపు వస్తున్న బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 30 కిలోల గంజాయి బయటపడింది. బొలెరో వాహనం వెనక పైలెటింగ్ చేస్తున్న వ్యక్తిని సైతం గుర్తించి, ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.60 వేలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. నిందితులను ఒడిశా రాష్ట్రం కొరాపుట్టు జిల్లా బడిగడ పంచాయతీ జయంతగేరి గ్రామానికి చెందిన షూసీ ఖరాతో పాటు ముంచంగిపుట్టు మండలం వనుగుమ్మ పంచాయతీ తర్లగూడ గ్రామానికి చెందిన వంతాల దేవదాసుగా గుర్తించామని, వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు.

పాత గంజాయి కేసులో వ్యక్తి అరెస్టు

గతంతో 684 కిలోల గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న ఏ–1 నిందితుడిని బుధవారం అరెస్టు చేశామని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు.గత ఏడాది జూన్‌లో లబ్బూరు వద్ద 684 కిలోల గంజాయిని పట్టుకోగా, మండలంలో గల లక్ష్మీపురం పంచాయతీ కిందుగూడ గ్రామానికి చెందిన కిల్లో త్రినాథ్ తప్పించుకు పారిపోయాడని, బుధవారం త్రినాథ్‌ను ముంచంగిపుట్టులో గుర్తించి, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు.

ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్‌లో డాక్‌యార్డు ఉద్యోగికి 5వ స్థానం

- ఫ్రాన్స్‌లో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించిన ఉజ్వల్ చౌధురి



విజయం సాధించిన ఉజ్వల్ చౌధురి

సాక్షి, విశాఖపట్నం : కజికిస్తాన్‌లో జరిగిన ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్‌లో నేవీ అనుబంధ సంస్థ నేవల్ డాక్‌యార్డు ఉద్యోగి అత్యుత్తమ ప్రతిభని కనబరిచారు. జూలై 2న జరిగిన పోటీల్లో ట్రయథ్లాన్‌ని 11 గంటల 4 నిమిషాల్లో ముగించిన డాక్‌యార్డు లెఫ్టినెంట్ కమాండర్ ఉజ్వల్ చౌధురి ఐదో స్థానంలో నిలిచారు. ఈ రేసులో 3.8 కిమీ స్విమ్మింగ్, 180 కిమీ సైక్లింగ్, 42.2 కిమీ మారథాన్‌ని 11 గంటల్లో పూర్తి చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ పోటీల్లో 400 మంది పాల్గొనగా.. భారత్‌కు చెందిన 50 మంది పాల్గొన్నారు. ఇండియా తరపున నంబర్‌వన్‌గానూ, వరల్డ్ టాప్–5లో చోటు సాధించి.. త్వరలో ఫ్రాన్స్‌లో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌కు ఉజ్వల్ చౌధురి అర్హత సాధించారు. ఉజ్వల్‌కు తూర్పు నౌకాదళం, డాక్‌యార్డు ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు.

ఆసియా కప్‌కు విశాఖ కుర్రాడు

- భారత్–ఏ జట్టుకు ఎంపికైన నితీశ్ కుమార్
- కుమారుడి కెరీర్ కోసం ఉద్యోగం మానేసిన తండ్రి
- ఏసీఏ నుంచి బీసీసీఐ అవార్డు పొందిన తొలి క్రికెటర్



నితీష్ కుమార్



ఎమ్మెస్కే ప్రసాద్ నుంచి అభినందనలు అందుకుంటున్న నితీశ్, చిత్రంలో రాహుల్ ద్రవిడ్(ఫైల్)

విశాఖ స్పోర్ట్స్: ఐదేళ్ల ప్రాయంలో ప్లాస్టిక్ బ్యాట్‌తో సరదాగా బంతితో ఆడటం మొదలుపెట్టిన కె.నితీష్‌కుమార్ రెడ్డి.. నేడు ఎమర్జింగ్ ఆసియా కప్ వన్డే టోర్నీలో ఆడేందుకు భారత్–ఏ జట్టుకు ఎంపికయ్యాడు. చిరుప్రాయం నుంచే విశాఖ డివిజన్ క్లబ్ లీగ్స్‌లో సీనియర్ల ఆటను చూస్తూ వారి లాగే ఆడాలంటూ కలగనే వాడు నితీశ్. తండ్రి ముత్యాలరెడ్డి ఉద్యోగం సైతం విడిచి పెట్టి.. కుమారుడి క్రికెట్ కెరీర్‌కే ప్రాధాన్యమిచ్చి ప్రోత్సహించారు. కోచ్‌ల శిక్షణలో నితీశ్ అంచెలంచెలుగా జిల్లా స్థాయి నుంచి రంజీ స్థాయికి ఎదిగాడు. కుడిచేతి వాటం బ్యాటింగ్‌తో పాటు మీడియం పేస్‌తో ప్రత్యర్థులను బెంబేలెత్తించి రికార్డులను సొంతం చేసుకున్నాడు. ఆంధ్రా జట్టుకు ఆల్‌రౌండర్‌గా మారాడు.

ఏసీఏ అకాడమీ వైపు అడుగులు..

నితీశ్‌కుమార్ వీడీసీఏ శిబిరాల నుంచి అండర్–12, 14 గ్రూప్‌ల్లో జిల్లాకు ఆడటం మొదలుపెట్టాడు. నార్త్‌జోన్‌కు ఆడే సమయంలో అప్పటి జాతీయ జట్టు సెలక్టర్ ఎం.ఎస్.కె.ప్రసాద్ నితీశ్ ప్రతిభను గుర్తించారు. ఆయన ప్రోత్సాహంతో కడపలోని ఏసీఏ అకాడమీలో శిక్షణకు అవకాశం లభించింది.

విజయ్ మర్చంట్ ట్రోఫీలో రికార్డు

ఆంధ్రా తరపున ఆడుతున్న నితీష్ నాగాలాండ్‌తో జరిగిన పోటీలో ఏకంగా 345 బంతుల్లోనే 441 పరుగులు సాధించడం విశేషం. విజయ్ మర్చంట్ ట్రోఫీలో ఏకంగా 26 వికెట్లు తీయడమే కాకుండా 176.41 సగటుతో 1,237 పరుగులు చేసి టోర్నీలో రికార్డును నమోదు చేశాడు. ఇదే నితీష్‌కు 2017–18 సీజన్‌లో బీసీసీఐ అండర్–16 ఉత్తమ క్రికెటర్‌గా జగన్మోహన్ దాల్మియా అవార్డును సాధించిపెట్టింది. ఏసీఏ నుంచి బీసీసీఐ అవార్డు పొందిన తొలి క్రికెటర్ నితీశ్ కావడం.. విశాఖ క్రీడాకారులకు నూతనోత్తేజం ఇచ్చింది.

అరంగేట్రం ఇలా..

నితీశ్ రంజీ ట్రోఫీలో ఆంధ్రా తరపున తొలిసారిగా 2020లో ఫస్ట్‌క్లాస్ క్రికెట్ మొదలెట్టాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్రా తరపున 2021లో ఆడాడు. అదే ఏడాది సీజన్‌లోనే సయ్యద్ ముస్తక్ అలీ ట్రోఫీలో పొట్టి ఫార్మాట్‌లో ఆడాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లోనూ సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున అరంగేట్రం చేశాడు. శ్రీలంకలో జూలై 13 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీలో ఐదు దేశాల ఏ జట్లతో పాటు నేపాల్, ఒమన్, యూఏఈ సీనియర్ జట్లు ఆడనున్నాయి.

చాలా ఆనందంగా ఉంది

అప్పుడు నా వయసు పన్నెండేళ్లు. అండర్–12లో టోర్నీలు ఆడే స్థాయికి చేరుకున్నాను. ఆ సమయంలోనే నాన్నకు విశాఖ నుంచి బదిలీ అయింది. నాన్న ఉదయపూర్ వెళ్లినా నా క్రికెట్ కెరీర్ గురించే ఆలోచించేవారు. ఈ క్రమంలో ఉద్యోగం మానేసి ఇక్కడకు వచ్చేశారు. అప్పుడు మా వాళ్లు కొందరు నాన్న ఏంటి ఇలా చేశారు అన్నారు. అయినా వారి మాటలను పట్టించుకోకుండా నన్ను ప్రోత్సహించారు. ఏసీఏ తరఫున తొలి క్రికెటర్‌గా బీసీసీఐ ఉత్తమ క్రికెటర్ అవార్డు అందుకోవడంతో నాలో ఆత్మ విశ్వాసం పెంచింది. అన్ని ఫార్మాట్లలో మేటి టోర్నీలో ఆడటంతో పాటు ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరపున క్రీజ్‌లోకి వచ్చి బ్యాటింగ్ చేస్తున్నప్పుడు నాన్న చాలా సంతోషించారు. భారత్–ఏ తరపున ఎమర్జింగ్ ఆసియా కప్‌కు ఎంపిక చేసిన 15 మంది జట్టులో స్థానం సాధించడం ఆనందంగా ఉంది. జాతీయ జట్టులో స్థానమే లక్ష్యంగా మరింత సాధన చేస్తా..

– నితీష్‌కుమార్ రెడ్డి, క్రికెటర్